

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు, చిన్నారులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 18 మంది చిన్నారులు పాల్గొన్నారు. చదువుతోపాటు ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొంటూ ఉండాలని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



క్విజ్‌ను ఆడిస్తున్న నిర్వాహకులు

పదేళ్లు దాటినా... పూర్తి కాని కాజ్‌వే పనులు

- ▸▸ శంకుస్థాపనకే పరిమితం
- ▸▸ రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గతంలో కురిసిన హుదూద్ తుఫాన్ కు కొట్టుకుపోయిన శీలంగొంది రోడ్డు చంపపట్టి కాజ్ వే పునర్నిర్మానంకు గ్రహణం పట్టుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు పదేళ్లు గడుస్తున్నా పునర్నిర్మాణం చేపట్టక పోవడంతో శీలంగొంది ప్రాంత గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో గెడ్డను దాటలేక గిరిజనులు బయట ప్రపంచానికి రాలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ కాజ్ వేకు అనుకొని చంపపట్టి, శీలంగొంది జాకరవలస, కోసంగి కాలనీ, కోసంగి, ఉయ్యాలగూడ, గొందిగూడతోపాటు పలు గ్రామాలకు ఈ కాజ్వే ప్రధాన వంతెనగా ఉంది. వంతెన లేక పోవడంతో 108 అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో సకాలంలో వైద్య సేవలు అందడం లేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. వ్యాధిగ్రస్తులను డోలీలతో మోసుకుని గెడ్డను దాటించవలసిన దుస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. దీంతోపాటు గిరిజనులు సాగు చేసిన కూరగాయలు, అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తరలించడానికి తరలించలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని గిరిజునలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసి వదిలేసారు:

ఈ కాజ్ వే పునర్నిర్మాణానికి సుమారు గత నాలుగేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల ముందు అప్పటి స్థానిక ఎమ్మెల్యే పాల్గుణ హడావిడిగా శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పలుమార్లు సిపిఎం, గిరిజన సంఘం నాయకులు ఆందోళన చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని ఆ ప్రాంత గిరిజనులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి కాజ్వే పనులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

తక్షణమే పనులు ప్రారంభించాలి

చంపపట్టి కాజ్వే పునర్నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదు. సుమారు పదేళ్లు గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం విచారకరం.శంకుస్థాపన చేసి పనులు చేయకుండా వదిలేశారు. వర్షాకాలంలో రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే కాజ్ వెను నిర్మించాలి. లేని పక్షంలో ఆందోళన చేపడతాం.



ఎస్‌బి పోతురాజు
సిపిఎం
మండల కార్యదర్శి


నిలిచిన పోయిన కాజ్‌వే


సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

వివాహాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం: వివాహం చేసుకునే వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో బుధవారం ఏడు మండలాల్లోని పంచాయతీ సచివాలయాల కార్యదర్శులు, ఇఒపిఆర్అండ్ రూరల్ డవలప్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామంలో యుక్త వయసు వచ్చిన యువత వివాహం చేసుకునేందుకు ముందు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోని పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు ఆయా గ్రామాల్లో పెళ్లిళ్లు చేసుకునే యువతకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. కొంతమంది యువకులు ఇతర గ్రామాల నుండి వచ్చి కొన్ని మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుని కొంతకాలం తర్వాత వదిలేసి వెళ్లిపోతున్నారని ఇసుకపట్ల గ్రామంలో ఇటువంటిది తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే సర్టిఫికెట్ కూడా ఇస్తామని తెలిపారు. ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించాలని అదేవిధంగా చిన్నవయస్సులో గర్భం దాల్చితే వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, జనన మరణ ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో జారీ చేయాలని ఆదేశించారు. ఇంటిపన్నులు సకాలంలో చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది పిఆర్‌యాప్-1 ఉపయోగించాలన్నారు. కొంతమంది అధికారులు కొన్ని గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తారని అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, డిఎల్ పిఒ కేయూ ఆర్ఎల్ పద్మజ, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి రమణి, ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి శివకుమార్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డు నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి-కూనవరం: కొత్తరేషన్‌కార్డుదారులకు సంబంధించి నిబంధనలు సడలించాలని, వివాహ ధ్రువీకరణ పత్రాలు ఉండాలనే నిబంధనను మినహాయింపు ఇవ్వాలని ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ అన్నారు. చింతూరు ప్రజాదర్బార్‌లో ఈ అంశానికి సంబంధించి వినతిపత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీలు పెళ్లిళ్లు చేసుకొని సుమారు పది సంవత్సరాలు అవుతున్నా రేషన్‌కార్డు లేకపోవడానికి ప్రధాన కారణం వివాహధ్రువీకరణ పత్రం. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తరేషన్ కార్డులకు వివాహ ధ్రువపత్రం, బర్త్‌సర్టిఫికెట్లు ఇవ్వాలంటే అది ఆదివాసులకు సాధ్యం కాదన్నారు. పెళ్లయి పిల్లలుండి వేరు కాపురాలు పెట్టుకుని సొంత ఇల్లు నిర్మించి హౌస్ హోల్డింగ్‌లో ఉన్నాకూడా రేషన్ కార్డులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై పరిశీలించాలని కోరామన్నారు.

అభివృద్ధి పేరుతో వెళ్లగొట్టేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న టాన్యా

ప్రజాశక్తి-రంపచోడవరం: అటవీ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలను ఆదివాసీలు ఐక్యంగా ప్రతిఘటించాలని ఆదివాసి రక్షణ చట్టాలైన 1/70, పీసా, అటవీ హక్కుల చట్టం 2005 చట్టాల అమలు కోసం ఆదివాసీలు ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలి సంఘం జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. బుధవారం రంపచోడవరంలో ప్రైవేట్ కళ్యాణ మండపంలో అఖిల భారత రైతు కూలి సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం, ఆంధ్ర రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఇలారామిరెడ్డి పల్లాల లచ్చిరెడ్డి, జోగారావు, ఎం.జగ్గయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టాన్యా మాట్లాడుతూ ఆదివాసీలను అడవి నుంచి గెంటి వేయడానికి అటవీసంపద దోచుకోవడానికి అభివృద్ధి పేరుతో ప్రాజెక్టులు, నేషనల్ పార్కులు, బాక్సైట్ ఖనిజాల వెలికితీత పేరుతో ఆదివాసీలను గెంటేస్తున్నారని ప్రతిఘటించిన వారిని మావోయిస్టుల పేరుతో అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తలారిప్రకాష్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్, అనసూయ, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్.కిరణ్‌కుమార్, వి.చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: రాబోయే రోజుల్లో ఉపాధి పనుల ద్వారా పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామ ఎపిడి రాంబాబు తెలిపారు. బుధవారం ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో వారాంతపు సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలానికి పండ్లతోటల విస్తరణకు 500 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు కంపోస్ట్ పిట్‌లు వెయ్యి తవ్వేందుకు ప్రణాళిక ఉందని, వాటిని రైతులు వినియోగించుకో వాలని రోజువారి వేతనం రూ.296లు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ రెడ్డిబాబు అధ్యక్షతన క్లస్టర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిడి రాంబాబు


మాట్లాడుతున్న సిసి లక్ష్మీనారాయణ

డ్వాక్రా రుణాల చెల్లింపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: డ్వాక్రా రుణాలు తీసుకున్న లబ్ధిదారుల నుండి ఎప్పటికప్పుడు రుణాలు తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని వెలుగు ఇన్‌చార్జి ఎపిఎం సుధాకర్ సిసి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బాలమ్మ అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.గ్రామసంఘాల పనితీరు, ఉపాధి, జీవనోపాదులపై సమీక్ష అనే వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు సత్యనారాయణ, వివో లీడర్స్, మండల సమైక్య లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మేకల మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో ఈదురు గాలులు మెరుపులతో కూడిన పిడుగుల వాన బీభత్సం సృష్టించింది. దీంతో ఐదు మేకలు మృత్యువాతకు గురయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ఆకాశమంత మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన గాలి వడగల వాన ఏకధాటిగా గంటన్నర పైగా కురిసింది. లుంగపర్తి పంచాయతీ పరిధి కుంబర్తి గ్రామాన్ని చెందిన జన్ని. సింహాద్రి, సివేరి. బాలకృష్ణకు చెందిన ఐదు మేకలు మేత కోసం గ్రామానికి సమీపం పొదల్లోకి వెళ్లాయి ఆ సమయంలో పిడుగుపడటంతో మేకలు మృతి చెందాయి. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

డముకు వారపు సంతలో నిత్యావసర సరుకుల కోసం గ్రామస్తులు వెళ్లారు. ఏకధాటిగా వర్షం కురవడంతో రైవాడ జలశయానికి ప్రవహించే లుంగపర్తి గెడ్డ పొంగి ప్రవహిచడంతో మెట్టువలస, మల్లెపాడు గిరిజనులు అవస్థలు పడి వెళ్లారు.


మృతి చెందిన మేకలు


తెల్లని మిరపకాయలు

మల్లెపువ్వుల్లా మిరపకాయలు..!

ప్రజాశక్తి-చింతపల్లి:మండల కేంద్రంలోని ప్రజాశక్తి విలేఖరి అచ్యుత్ రామయ్య పెరటిలో పచ్చిమిర్చి చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సాధారణంగా మిరపకాయలు హరితంగా లేదా ఎర్రగా ఉంటాయి. కానీ, ఈ మొక్కపై ఎదిగిన మిరపకాయలు మల్లెపువ్వులా తెల్లటి రంగుతో ఆకట్టుకుంటున్నాయి. ఆ ఆకారమే కాదు, రంగు, కూర్చున్న తీరు కూడా పువ్వుల్లా కనిపించడంతో స్థానికులలో ఆసక్తిని రేకెత్తిస్తుంది.

పనులు కల్పించకుంటే చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించని సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీవో ఏవివి. కుమార్ హెచ్చరించారు బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాయుడు ఆధ్వర్యాన స్థానిక కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్దిదారులకు పని దినాలు కల్పించాలని, రోజు కూలి 307 రూపాయలు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండలంలో ఉన్న 24 పంచాయతీ పరిధిలో ఫారం ఫండ్స్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో 100 కంపోస్ బిట్స్, ఐదు స్ప్రింగ్ ఫండ్స్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ


వినతిపత్రాన్ని ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

కిడారిని కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:నూతనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజెఎఫ్ అరకులోయ మండల కమిటీ సభ్యులు బుధవారం రాష్ట్ర జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ను పాడేరు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన అరకులోయ ప్రెస్ క్లబ్ భవనం ప్రారంభించి అప్పగించాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించి ప్రెస్ క్లబ్ భవనాన్ని అప్పగించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజెఎఫ్ కార్యదర్శి వంతల డేవిడ్, మండల అధ్యక్షుడు బిమిడి త్రినాద్, సహాయ కార్యదర్శి రామునాయుడు, కోశాధికారి కె సింహాద్రి, ప్రధాన కార్యదర్శి కె సింహాచలం,కె రామన్న పాల్గొన్నారు.


దగ్ధమైన సామగ్రి


గృహంలో వంట గ్యాస్ లీక్

-కాలి బూడిదైన సామగ్రి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని లోతుగడ్డ పంచాయితీ చెరుకుంపాకలు గ్రామంలో బుధవారం గ్యాస్ దుర్ఘటన చోటుచేసుకుంది. గ్యాస్ లీక్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైంది. చెరుకుంపాకలకు చెందిన సుధ కృష్ణ బట్టల వ్యాపారిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య లక్ష్మి పార్వతి కుట్టు మిషన్ ద్వారా జీవనం సాగిస్తున్నారు. బుధవారం కృష్ణ వదిన సంగా గీత ఇంటి వరండాలో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. మంటలు బట్టలకు అంటుకోవడంతో గీత బయటకు పరుగెత్తింది. ఇంట్లోని కరెంట్ వైరింగ్, వస్త్రాలు, సామగ్రి దగ్ధమైంది. స్థానికులు స్పందించి మంటలను ఆర్పేందుకు యత్నించినప్పటికీ కాలి బూడిదయ్యాయి. సంగా గీతకు స్వల్ప గాయాలు అయ్యాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఉచితం ముసుగులో ఇసుక దందా

- అర్ధరాత్రి ఇసుక తరలింపు
- వేరేచోట స్టాక్‌పాయింట్ల ఏర్పాటు
- నిమ్మకు నీరెత్తుతున్న అధికారులు



లారీలో తరలిస్తున్న ఇసుక


గోతులు పెట్టి తవ్వి తీసిన ఇసుక

ప్రజాశక్తి-ఎటపాక:ఎటపాక మండలం ఇసుక దొంగలకు అడ్డాగా మారింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక ర్యాంపును ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే దానిని ప్రైవేటు గుత్తేదారుకు కట్టబెట్టడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచితఇసుక పథకాన్ని ప్రవేశపెట్టింది. గృహనిర్మాణం కోసం ఎక్కడికక్కడ ఇసుక తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. ఇది ఎటపాక మండల కేంద్రానికి సమీపంలో ఉన్న భద్రాచలానికి ఒక వరంలా మారింది. దీన్ని ఆసరాగా చేసుకొని ఇసుక మాఫియా రెచ్చిపోతున్నారు. వీరికి అధికార నాయకుల అండదండలు ఉండడంతో భద్రాచలం చుట్టుపక్కల ఎటపాక మండలంలో ఎటపాక, చెన్నంపేట, చింతలగూడెం, గుండాల, రాయన్నపేట గ్రామాల్లో ప్రైవేట్‌గా ర్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. వీరికి అధికార పార్టీలో ఒక వర్గంతో పాటు అధికారులు కూడా సంపూర్ణ సహకారం అందిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాత్రి సమయంలో గోదావరిలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా వేరే ప్రాంతాలకు తరలించి స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడినుండి పట్టపగలే సమీపంలోని భద్రాచలానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దొంగతనంగా ఇసుకను అమ్ముకోవాలని అడ్డదారులు తొక్కుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ఎటపాక, రాయనపేట పరిధిలో దొంగతనంగా ఇసుక తరలిస్తూ ప్రమాదవశాత్తూ ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నెల 6న ఇసుక లారీ బోల్తా పడింది. లారీని సరిచేసేందుకు జెసిబితో ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తూ జెసిబి ఓనరు అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా 12వ తేదీ రాత్రి రాయనపేట పరిధిలో రాత్రి ట్రాక్టర్‌పై ఇసుక తరలిస్తుండగా కూలి పనికి వచ్చిన రాజుపేట యువకుడు ట్రాక్టర్‌పై కూర్చుని ఉన్నాడు. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తాపడి కోడి చరణ్ మృతి చెందాడు. మైనింగ్, రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అక్రమ ఇసుక దందా నడుస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక దందాను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం

సిపిఎం తరపున ఇసుక దందాను మొదటినుంచీ వ్యతిరేకిస్తున్నాం. ప్రతి సందర్భంలో ఇసుక దొంగలు పోలీసుల సహకారంతో బయటపడుతున్నారు. 2022లో ప్రదర్శనగా వెళ్లి అడ్డుకుంటే పోలీసులు ఇసుకదందా చేస్తున్న వ్యక్తికి అండగా వచ్చి ధర్నా చేస్తున్న వారిని భయపెట్టి పంపించడానికి ప్రయత్నం చేశారు.సక్రమమైన పద్ధతిలో ఇసుక తెచ్చుకోవడానికి అవకాశం ఉంటే ఇలా ప్రాణాల మీదికి రాదు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే సిపిఎం తరపున పోరాటం చేస్తాం.



- ఐ.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు

నేడు రిలే నిరాహార దీక్షకు హాజరు కావాలి

ప్రజాశక్తి- దేవీపట్నం: ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని రంపచోడవరం ఐటిడిఎ వద్ద గురువారం నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలకు ప్రతి ఆదివాసీ హాజరు కావాలని ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆదివాసి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని,షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3 చట్టబద్ధతకై ఎన్నికల ముందు అరకులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని, తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటుకు తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని తదితర సమస్యల పరిష్కారానికి రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తామన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలకు అంతా హాజరు కావాలన్నారు.

విఆర్‌పురం: ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని ఐటిడిఎ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు హాజరుకావాలని ఆదివాసి జెఎసి డివిజన్ వైస్‌చైర్మన్ వేటకాని మల్లయ్య కోరారు. జిఒ నంబర్ 3ని పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకు కల్పించాలని తదితర డిమాండ్లతో దీక్ష కొనసాగిస్తామన్నారు. అలాగే ఈ నెల 16వ తేదీన చింతూరు సంత ఆవరణలో సాయంత్రం ఆదివాసి హక్కుల గర్జన సభకు ఆదివాసీలంతా హాజరుకావాలన్నారు

తాగునీటి కుళాయిలు ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్, సమితి ప్రతినిధులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ గ్రామాల్లో కందుగూడ, ముంజా గూడ, బొజాయి గూడలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో నవ నిర్మాణ సమితి (సర్ఫట్టం) ఆధ్వర్యంలో తాగునీటి కుళాయిలను బుధవారం స్థానిక సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్, నవనిర్మాణ సమితి మేనేజర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామ పెద్ద వి.జగన్నాథం అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ కొర్రా త్రినాథ్ మాట్లాడుతూ, కేందుగూడ, మెుంజగూడ, బొజాయిగూడ గ్రామాల్లో సుమారు14 లక్షల రూపాయల ఖర్చుతో మంచి నీరు సౌకర్యం కల్పించడంపై ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎంపిటిసి వి.సాధురామ్ మాట్లాడుతూ,కుళాయిలు సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవనిర్మాణ సమితి సూపర్ వైజర్ ఎస్.సుబ్రత, త్రినాథ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-చింతపల్లి: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణంలో నాగ సాయి కళాబృందం ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆసుపత్రి ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ నెల్లి గోవింద్ పర్యవేక్షణలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక హాజరై మాట్లాడుతూ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చని ఆమె సూచించారు. కళా బృందం ప్రదర్శించిన పాటలు, నాటికలు ప్రజల్లో ఆసక్తిని కలిగించాయి. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు లోవరి లక్ష్మమ్మ, పెంట కుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి మాతృ వియోగం

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాతృమూర్తి గంగా భవాని మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె గత కొన్నాళ్ళుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విశాఖపట్నంలోని కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న ఆమె తుది శ్వాస విడిచారు. ఆమె దివంగత మాజీ ఎమ్మెల్యే కొట్ట గుళ్లి చిట్టి నాయుడు సతీమణిగా పాడేరు పట్టణంలో టిడిపి శ్రేణులకు పట్టణ ప్రజల అందరికీ సుపరిచితురాలు! ఈమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకొని భాగ్యలక్ష్మి 2019లో ఎమ్మెల్యే అయ్యారు. గంగాభవాని మృతి పై పలువురు సంతాపం తెలియజేశారు. రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ తో పాటు పలువురు వైసిపి, టిడిపి, నాయకులు తదితరులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు..

లేబర్ కోడ్స్ రద్దుకు పోరాటం



బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అడ్డతీగల: లేబర్‌కోడ్‌లు రద్దు చేసి కార్మికుల కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం అడ్డతీగల వినాయక తాపీపనివారి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి కార్మికచట్టాలను సవరించి, కార్పొరేట్లకు అనుకూలమైన, లేబర్‌కోడ్‌లను తీసుకువస్తున్నారని ఆరోపించారు. కరోనా సమయంలో పార్లమెంట్‌లో చర్చ లేకుండానే లేబర్‌కోడ్‌లను కేంద్రం ఆమోదించిందని అవి ఈ సంవత్సరం అమలుకు నోటిఫికేషన్ ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించడం దుర్మార్గపు చర్య అన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలని జాతీయ కార్మిక మహాసభ సిఫార్సులు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీ మినీసెంటర్లను మెయిన్‌సెంటర్లుగా మార్చాలని, విఒఎల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల విద్యార్థులకు మెనూచార్జీలు పెంచాలని, భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి పర్మినెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మికసంఘాలు సమ్మెకు పిలుపు నిచ్చాయని సమ్మె విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నిర్మల, చింతా రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు గుల్లలసురేష్, బాబు, చాగంటి ఆదినారాయణ, మండల నాయకులు బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

శాకర్ణి ప్లాస్టర్‌తో కోరమాండల్ కెమికల్స్ ఎంఒయు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కంపెనీల ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కోరమాండల్ కెమికల్స్ లిమిటెడ్, ఫాస్ఫో జిప్సం ఆధారిత గ్రీన్ బిల్డింగ్ మెటీరియల్స్ తయారీ, అమ్మకం కోసం శాకర్ణి ప్లాస్టర్‌తో కలిసి ఉమ్మడి సంస్థను ఏర్పాటు చేయడానికి బుధవారం ఉదయం ఒప్పందాలపై సంతకం చేసింది.

ఈ సందర్భంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ - సిఇఒ ఎస్.శంకరసుబ్రమణియన్ మాట్లాడుతూ ఈ ఉమ్మడి భాగస్వామ్య సంస్థ, పర్యావరణ పరిరక్షణ ఆర్థిక లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో కోరమాండల్ కోసం వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని, పర్యావరణ అనుకూల నిర్మాణ సామగ్రిలో నూతన ఒరవడి సృష్టిస్తుందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం, స్థానిక తయారీని ప్రోత్సహించడం, దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని తెలిపారు. కోరమాండల్ తయారీ బలాన్ని, సాకర్ణి మార్కెట్ నాయకత్వంతో మిళితం చేయటం ద్వారా, భారతదేశ గృహనిర్మాణ, మౌలిక సదుపాయాల రంగంలో అభివృద్ధి చెందుతూ అవసరాలకు అనుగుణంగా అధిక-నాణ్యతతో పాటు పర్యావరణానికి అనుకూలంగా జిప్సం సేవలను అందించటమే మేము లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

టిడిపి మండల అధ్యక్ష పీఠంపై యువత ఆసక్తి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: టిడిపి అధిష్టానం త్వరలో నూతనంగా నియామకం చేపట్టనున్న స్థానిక మండల అధ్యక్ష ఎన్నికలపై స్థానిక అ పార్టీ యువ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలో ఉండటంతో సీనియర్ నాయకులతో పాటు యువ నాయకులు సైతం అధ్యక్ష పదవి దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతూ ఎవరి ప్రయత్నాలు వారు సాగిస్తున్నారు. పోటీదారులు తమకు అనుకూలమైన నాయకులను, కార్యకర్తలను మద్దతు తెలపాలంటూ మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగకుండా ముందు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక డుంబ్రిగుడ మండలం ఉన్నప్పుడు ఇక్కడ టిడిపి పార్టీ బలంగా ఉండేది. డుంబ్రిగుడ మండలమంటే టిడిపి కంచుకోటగా చెప్పుకునేవారు. ప్రస్తుతం మండలంలో పార్టీ బలహీనంగా మారింది.

మండల వ్యాప్తంగా 13 ఎంపీటీసీ సభ్యులకు గాను ఒక్క మండల కేంద్రం పోతంగి పంచాయతీలోని టిడిపి ఎంపిటిసి అభ్యర్థి గెలుపొందారు. మిగిలిన 11ఎంపీటీసీ స్థానాలన్నీ వైసిపి గెలుపొందంగా బిజెపి ఒక స్థానం గెలుపొందారు. సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ గ్రామ స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయడంలో శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు నుంచి వస్తుంది. పైగా యువతకు ప్రాధాన్య ఇవ్వకపోవడంతో గ్రామాల్లో పనిచేయడానికి వెనకడుగు వేయవలసిన పరిస్థితి వస్తుందని చర్చ జరుగుతుంది. దీంతో ప్రస్తుతం జరిగే అధ్యక్షులు పార్టీ విధానాలకు కట్టుబడి కష్టపడే యువ నాయకులకు కేటాయిస్తే పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయడం జరుగుతుందని ఆ పార్టీ యువత అంటున్నారు.

మండలంలో వైసిపి, సిపిఎం, బిజెపి పార్టీలు ఉండగా ఆ పార్టీ లన్నింటిలో యువ నాయకులే మండల అధ్యక్షుడు పదవుల్లో ఉన్నారు. దీంతో టిడిపిలో కూడా యువకులకు ప్రాధాన్యత కల్పిస్తే మండల వ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని యువత కోరుతున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి మొదటి ఇంటర్ మీడియట్‌లో ప్రవేశలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్ ఈశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో 40, బై పి సి లో 40, హెచ్ సి సి లో 40, సిఇసిలో 40, ఎ అండ్ టి 40 సీట్ల భర్తీకి పదవ తరగతి ఉతీర్ణత సాధించిన విద్యార్థులు పాడేరు గురుకులం సెల్ లేదా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు

మోదమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరించిన ఎంపిపి, నాయకులు

ప్రజాశక్తి -పెదబయలు :మండల కేంద్రంలో ఈనెల 18,19,20వ తేదీల్లో నిర్వహించే మోదకొండమ్మ జాతర పోస్టర్‌ను ఎంపీపీ బి.వరహాలమ్మ, సిపిఎం మండల కార్యదర్శి బి సన్నిబాబు ఆవిష్కరించారు. మూడురోజుల పాటు మోదకొండమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కె బొంజుబాబు, సర్పంచీ పి మాధవరావు, కార్యదర్శి టి చక్రదర్, వైసీపీ నాయకులు గంపరాయి సూరయ్యలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారంతో ఊబకాయానికి స్వస్తి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : రోజూ ఆహారంలో ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను తీసుకోవడం ద్వారా ఊబకాయానికి స్వస్తి పలకవచ్చని పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ తెలిపారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, బరువు పట్ల జాగ్రత్త వహించేవారు ఆహారంలో బాదం, పండ్లు, కూరగాయలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు గుప్పెడు బాదం, మూంగ్ డాల్, మొలకలు, దోసకాయ సలాడ్, వేయించిన శనగలు వంటి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చునని ఆమె తెలిపారు.

నిత్యావసరాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : రానున్న వేసవికాలంలో అమెజాన్ ఫ్రెష్ ద్వారా ప్రత్యేక సీజనల్ సేవింగ్స్ ఆఫర్లను అందిస్తున్నామని సంస్థ స్పెషల్ డైరెక్టర్ క్రత్ తెలిపారు. బీచ్ రోడ్డులోని అంబికా సీక్రెట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించే క్రమంలో కేవలం రెండు గంటల్లోనే డోర్ డెలివరీ చేస్తున్నామని, స్లాట్ డెలివరీ సౌకర్యం కూడా తమ వద్ద ఉందని తెలిపారు. సూపర్ వాల్యు డేస్ పేరుతో శుక్రవారం నుండి ఆదివారం వరకు ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామని, తద్వారా కిరాణా సరుకులు, ఇతర గృహోపకరణాలపై భారీగా సొమ్మును ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. మామిడి పండ్ల సీజన్‌ను గృష్టిలో ఉంచుకొని 10 రకాల మామిడి ఉత్పత్తులను భారీ రాయితీతో అందిస్తున్నామని, ఐపిఎల్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్ సమయాల్లో స్నాకింగ్ డెస్టినేషన్ ఆఫర్లు అందిస్తున్నామని, ఇందులో వివిధ రకాల చిప్స్, పానీయాలు, రెడీ టు ఈట్ ట్రీట్ వంటివి అందుబాటులో ఉంటాయని వివరించారు.

కొమర్రాజు లక్ష్మణరావు గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు జాతి సంస్కృతీ వైతాళికుడు కొమర్రాజు లక్ష్మణరావు జీవిత సాహిత్య కృషిని గురించి విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు పేరుతో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు రచించిన గ్రంథాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ హిందీభవన్‌లో పద్మభూషణ్, కేంద్ర ప్రభుత్వ హిందీ సలహా మండలి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



రైతులకు నవధాన్యాల కిట్ అందిస్తున్న వ్యవసాయాధికారి రఘుకుమార్

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: రైతాంగానికి నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని వి.ఆర్ పురం ఆర్.బి.కె కేంద్రం కండుకూరులో బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖాధికారి యస్.రఘుకుమార్ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందుగా ఈ విత్తనాలను వేసుకోవాలన్నారు. దీనివల్ల వివిధ పంటల వేర్లు భూమిలో ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడేలా సంతతిని అభివృద్ధి చేస్తాయని తద్వారా ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మ మరియు స్థూల పోషకాలు అందుబాటులోకి తీసుకువస్తూ మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేటట్లు చేస్తాయని సూచించారు. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా కూడా ఉపయోగపడతాయని నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయన్నారు. నేలలో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. పలు పంటలు సాగు వలన అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఎస్ఎస్ జ్యోతిర్మయి మాట్లాడుతూ నేలలో సేంద్రియ కర్బనశాతం పెరుగుతుందని.రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వివి ప్రసాద్ ఎల్-1 క్యాడర్ కల్యాణరావు, హరిబాబు రాజు, రజని, మీనా తదితరులు పాల్గొన్నారు.

గుబేలుపేటలో తాగునీటి వెతలు



పాడైన బోరు

ప్రజాశక్తి-చింతూరు: మండల కేంద్రంలోని సినిమాహాలు వెనకవీధి గుబేలుపేటలో గత మూడు సంవత్సరాలుగా బోరు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొంటున్నారు. 2022లో వచ్చిన వరదలకు వారం రోజులపాటు బోరు నీట ముంపులో ఉండటంతో కేటుమున్నట్టి శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. దీంతో తాగునీటికి గుబేలుపేట వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మరమ్మతులు చేయించి, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : వైద్యఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రభు, కార్యదర్శి స్వాతి మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ళ పూర్తి చేసుకున్న సిహెచ్ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సద్య, మౌనిక, గీత, పూర్ణిమ, కల్పన, దివ్య, శోభ, శిరీశ, ఎవాంజెలిన్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ప్రత్యేక బస్సుల ఆదాయం రూ.6 లక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాడేరు మోదకొండమ్మ జాతరకు విశాఖపట్నం నుంచి నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.6 లక్షల వరకు ఆదాయం వచ్చిందని ఎపిఎస్ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో భారత వికాస పరిషత్ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రయాణికులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం నుంచి అమలాపురానికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు ఉదయం 8:45 గంటలకు అదనంగా ఒక బస్సును వేసినట్లు తెలిపారు. కాకినాడకు ఉదయం 5:15 గంటలకు, సాయంత్రం 4:15 గంటలకు అదనపు బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1499వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తామని కేంద్రం నాలుగేళ్ల క్రితం ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని, దీనికి కార్మికులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలే కారణమన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ కంటి తుడుపుగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగదాంబ జోన్ సిఐటియు నాయకులు కె.నరసింగరావు, కె.చంద్రశేఖర్, ఎన్.సంజీవ్, ఎం.చంద్రమౌళి, బి.రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్ల నియామకానికి 'పల్లా' హామీ



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు


ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్, జడ్‌పి స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. బుధవారం ఆవాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావును కలిసి మున్సిపల్, జడ్‌పి స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి డిఇఒతో వెంటనే మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సిఫారసు చేస్తూ లేఖ రాయమని తన పిఎకు ఎమ్మెల్యే పల్లా ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆవాజ్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి అశ్రఫ్, సభ్యులు షేక్‌రెహమాన్ తదితరులు ఉన్నారు.

రూ.13.50 కోట్లతో నిర్మాణం... ఆపై 'వేలం'?

సాగర్‌నగర్‌లోని ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ భవన్‌పై విఎంఆర్‌డిఎ నిర్ణయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగరతీరానికి అభిముఖంగా ఇస్కాన్ టెంపుల్ పక్కన సాగర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ భవనాన్ని విఎంఆర్‌డిఎ వేలానికి పెట్టింది. గడిచిన కొన్ని నెలలుగా విద్యుత్ శాఖ భవన్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అది సిద్ధమైంది. ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిమిత్తం దీన్ని రూ.13.50కోట్లతో నిర్మాణం చేపట్టారు. తాజాగా దీంట్లో గ్రౌండ్‌ఫ్లోర్‌ను మాత్రమే ట్రైనింగ్ కోసం వాడుకోడానికి నిర్ణయించారు. మిగతా రెండు అంతస్తుల్లోని ఆఫీసు స్థలాన్ని నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చేందుకు విఎంఆర్‌డిఎ టెండరు కమ్ వేలానికి ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. పూర్తి వివరాల కోసం విస్తీర్ణం, అద్దె, విఎంఆర్‌డిఎ అప్‌సెట్ ధర కోసం వెబ్‌సైట్ www.vmrda.gov.in నందు పొందుపరిచినట్లు విఎంఆర్‌డిఎ వెల్లడించింది. స్థలాన్ని యథాతథంగా 3 ఏళ్లపాటు నెలసరి అద్దె ప్రాతిపదికపై వేలం వేసేందుకు నిర్ణయించారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను విఎంఆర్‌డిఎ వెబ్‌సైట్ నందు గాని సిరిపురంలోని కార్యాలయం 8వ అంతస్తులోని రెవెన్యూ విభాగం వద్ద తీసుకోవచ్చు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చలానా, డీడీలు విఎంఆర్‌డిఎకు అందజేయాల్సి ఉంటుంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సిరిపురంలో దరఖాస్తు రుసుము ఒక్కొక్క అంతస్థునకు రూ.5000, చలానా రూపంలో చెల్లించాలి. దరావత్తు సొమ్ము (ఇఎండి) ఒక్కొక్క దానికి రూ.లక్ష చొప్పున విఎంఆర్‌డిఎ ది మెట్రోపాలిటన్ కమిషనర్ విశాఖపట్నం పేరున డిడి తీసి దరఖాస్తులను పైన తెలిపిన అడ్రస్‌కు అందజేయాలని విఎంఆర్‌డిఎ వెల్లడించింది. బహిరంగంగా ఈ పై రెండు అంతస్తుల వేలం ప్రక్రియను జూన్ 3వ తేదీన ఉదయం 11గంటలకు సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించనున్నారు.



ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ భవనం

ఎర్నిమాంబ జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురం సమీపంలోని శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డివిఎస్.సురేష్ బాబా తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సవాలు ఈ నెల 14 నుండి 18వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు. బుధవారం అమ్మవారి వార్షిక జాతర ప్రారంభమైందని, ఆలయ ప్రాంగణంలో భక్తి సంగీత విభావరిని ఏర్పాటు చేశామని తెలిపారు. 15న అమ్మవారికి నీలధార సమర్పణ, 16న మూలమంత్ర హవనం, సాయంత్రం 5 గంటలకు కూచిపూడి నృత్యప్రదర్శన, 17న తొలేళ్ల ఉత్సవం, 18న జాతర ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు ప్రసాద్, రామకృష్ణ పాల్గొని ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

స్మార్ట్ ఫోన్ల ప్రీఆర్డర్లు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, సన్నని గెలాక్సీ ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ కోసం ప్రీ ఆర్డర్లను ప్రారంభించినట్టు శాంసంగ్ మొబైల్ ఫోన్ విభాగ హెడ్ శ్రీని మీడియాకు తెలిపారు. గెలాక్సీ ఎస్ 25 ఎడ్జ్, స్థిరమైన టైటానియం బాడీలో ప్రీమియం, ప్రో లెవల్ పనితీరు కనబరుస్తుందని పేర్కొన్నారు. గెలాక్సీ ఎస్25 ఎడ్జ్ ఎస్ సిరీస్ వారసత్వాన్ని అందిస్తుందని, ఐకానిక్ గెలాక్సీ ఎఐ ఆధారిత కెమెరాను ఏకీకృతం చేస్తుందని వివరించారు.

ఇల్లు మంజూరైనా.. స్థలం లేదు



ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -సీలేరు: అన్నీ ఉన్నా.. అల్లుడినోట్లో శని అన్న చందంగా ఉంది పివిటిజి ఇళ్ల పరిస్థితి. పివిటిజి ఇళ్లు నిర్మించుకోవటానికి గ్రామకంఠం స్థలం లేక ఘర్షణలకు దారితీస్తుందని ఏ.దారకొండ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జికెవీధి మండలం ఏ.దారకొండ పంచాయతీలో పివిటిజి గిరిజనులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఇళ్లు నిర్మించుకోవడానికి గ్రామకంఠం స్థలం తెలియక ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం లేక గ్రామస్తుల మధ్య వివాదానికి దారితీస్తోందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఐటిడిఎ పిఒ స్పందించి మంజూరైన ఇళ్లు నిర్మించుకోడానికి వివాదం లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. జికెవీధి తహశీల్దార్ రామకృష్ణను తమ గ్రామానికి పంపించి గ్రామకంఠం స్థలం నిర్ధారణ చేసి లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించాలని పివిటిజిలు, వార్డు మెంబర్ కుంట ఆనందరావు కోరారు.

పోలీస్ శాఖకు స్టాపర్లు అందజేత



స్టాపర్లు ప్రారంభిస్తున్న కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ కమిషనరేట్ పరిధిలో ఉన్న హాస్పిటల్స్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా నగర సిటీ పోలీసులకు 50 ఐరన్ స్టాపర్లను బుధవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చికి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఈ స్టాపర్లు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, లాఅండ్ఆర్డర్ విధులు నిర్వహించడానికి, పండుగలు, ఉత్సవాల సమయంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. వీటిని అందించిన మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ చెప్పా, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ మోహన్ మహారాజ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి కె.ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సిఐలు కెఎన్‌ఎస్‌వి.ప్రసాద్, ఎం.శ్రీను పాల్గొన్నారు.